



# టాక్ షో కథలు

## – కిరణ్ ప్రభ

గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 1200 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# శతాబ్దాల తెలుగు పత్రికలు తీరుతెన్నులు

## -10-

ఈ భాగంలో కూడా 1960 లో ప్రారంభమై కొన్ని దశాబ్దాల పాటు కొనసాగిన మరికొన్ని తెలుగు పత్రికల గురించి విశేషాలు తెలుసుకుందాం. ముందుగా 1963లో ప్రారంభమయి 25 ఏళ్లకు పైగా విజయవంతంగా కొనసాగిన "జ్యోతి మాసపత్రిక " గురించి తెలుసుకుందాం. ఒక్కసారి ఆ దశాబ్దానికి వెళితే.. ఆంధ్రప్రభా, ఆంధ్రపత్రికా, వార పత్రికలు. అలాగే భారతి మాసపత్రిక. వీటి తర్వాత క్రమం తప్పకుండా వెలువడుతూ, తెలుగు సాహితీ ప్రియుల్ని ఆకర్షిస్తున్నది "యువ" మాత్రమే. భారతి మాస పత్రికతో పోలిస్తే, సాధారణ పాఠకుల్ని చేరగలిగింది యువ. ఆ సమయంలో యువ మాసపత్రిక ప్రారంభమైన మూడు సంవత్సరాల్లో సరికొత్తగా నవ్యాతి నవ్యంగా దూసుకొచ్చింది "జ్యోతి" మాసపత్రిక.

విజయవాడ కేంద్రంగా ప్రారంభమై, సుదీర్ఘకాలం కొనసాగిన మొట్ట మొదటి తెలుగు కథల మాస పత్రిక "జ్యోతి"అని చెప్పుకోవచ్చు. 3 దశాబ్దాలు కొనసాగిన జ్యోతి మాసపత్రిక గురించి తెలుసుకోబోయే ముందు, అదే

పేరుతో అంతకు ముందు నడచిన పత్రికల గురించి తెలుసుకుందాం. 1940 దశాబ్దంలో తెనాలి పట్టణం లో అనేక మంది సాహిత్యాభిలాషులూ, రచయితలూ వుండేవాళ్ళు. కొడవటిగంటిగారూ, చక్రపాణిగారూ, ధనికొండ హనుమంతరావుగారూ, కొమ్మూరి వెంకటరామయ్యగారూ, ఆలపాటి రవీంద్రగారూ ... ఇంకా చాలా మంది. వీళ్ళు రచయితలు అవ్వడమే కాకుండా పత్రికలు తీసుకురావడం, పుస్తక ప్రచురణ ఇలాంటి కార్యక్రమాలు కూడా కొనసాగించారు. అందులో భాగమే ఆలపాటి రవీంద్ర గారి సంపాదకత్వంలో 1947 లో తెనాలిలో ప్రారంభమైంది జ్యోతి సచిత్ర కధల పక్షపత్రిక. ధనికొండ హనుమంతరావుగారు కూడా అందులో భాగస్వాములే. చరిత్ర పరంగా చూస్తే "జ్యోతి" అన్న పేరుతో ప్రారంభమైన తొలి పత్రిక అదే. తెనాలి నుండి సుమారుగా 5 సంవత్సరాలుగా కొనసాగింది. 1951, 52 ప్రాంతాల్లో ఆ జ్యోతి పక్షపత్రిక ఆగిపోయింది.

ఆ తర్వాత ధనికొండ హనుమంతరావు గారు మద్రాస్ వెళ్లడం, "చిత్ర సీమ" అనే పత్రికను ప్రారంభించడం, ఒక సంవత్సరం తర్వాత దాంట్లో నుండి బయటకు వచ్చేసి, "క్రాంతి ప్రెస్"అనే పేరుతో ప్రింటింగ్ ప్రెస్ ప్రారంభించడం, ఇవన్నీ జరిగాయి. ఆ క్రాంతి ప్రెస్ తరపున ధనికొండ హనుమంతరావు గారు తాను రాసిన పుస్తకాలూ, ఇతరులు రాసిన పుస్తకాలూ కూడా పబ్లిష్ చేస్తుండేవారు. ఆ క్రమంలో 1959 ఆగస్టులో హనుమంతరావు గారు అంతకు ముందు 8 ఏళ్ళక్రితం తెనాలిలో మూతబడిన జ్యోతి పక్షపత్రికను, మళ్ళీ మాస పత్రికగా మద్రాస్ నుండి మొదలు పెట్టారు. ఇంకో ఆసక్తి కరమైన విషయం ఏమిటంటే, ఈ జ్యోతి మాస పత్రికకు కేవలం సంపాదకుడు మాత్రమే ధనికొండ హనుమంతరావు గారు. దాని పబ్లిషర్ V. V. రాఘవయ్య గారు. వెల్లంకి వీర రాఘవయ్యగారు. ఈ జ్యోతి మాస పత్రిక 1,2 సంవత్సరాలు మించి నడవ లేదు. 1960,61 లోనే ఆగిపోయింది. దాని పబ్లిషర్ అయిన వి. వి. రాఘవయ్య గారే 1963 నుంచి అదే పేరుతో విజయవాడ నుంచి సరికొత్తగా మొదలుపెట్టారు. అదే జ్యోతి మాస పత్రిక.

జ్యోతి అనే పత్రిక పేరు వెనకాల ఇంత కథ వున్నది. ఈ కొత్త జ్యోతి మాస పత్రిక విశేషాలు తెలుసుకోబోయే ముందు, దాని మూలస్తంభమైన వి.వి. రాఘవయ్య గారి గురించి తెలుసుకుందాం. వి.వి. రాఘవయ్య గారిని ఆ రోజుల్లో జ్యోతి రాఘవయ్యగారు అని కూడా అంటుండేవారు. ఆయన స్వస్థలం విజయవాడ దగ్గర కలవపాముల. వీళ్ళ నాన్నగారి పేరు వెల్లంకి వెంకట పతి, అమ్మగారి పేరు వెంకట సుబ్బమ్మ గారు. వాళ్ళిద్దరికీ రెండో అబ్బాయి ఈ రాఘవయ్య గారు. ఆగస్టు 30 1920 న జన్మించారు. చిన్నప్పుడు కలవపాముల లోనే చదువుకున్నారు. ఆ తరువాత తాడంకి, జగ్గయ్య పేట, బందరు, విజయవాడ లలో చదువుకొని బి. కాం. పట్టా పుచ్చుకున్నారు.

చిన్నప్పటినుండి కూడా రాఘవయ్య గారికి వున్న ఒక గుణం ఏమిటంటే, ఏదైనా అనుకుంటే, దాన్ని ఖచ్చితంగా అమలుపరచి తీరాలి. ఆ పట్టుదల ఉండేది. అలాగే ఎవరినైనా ఆకట్టుకునే శక్తి సామర్ధ్యాలూ, ఆకర్షణ ఉండేది ఆయన

మాటల్లోనూ, ప్రవర్తన లోనూ. స్టూడెంట్ గా వున్నప్పటినించే ఆయన సాహిత్యాభిమాని. కళా పిపాసి. చాలా అభ్యుదయ భావాలతో వుంటుండేవాడు. అందుకే ఆయన స్టూడెంటుగా ఉండగా, స్టూడెంట్ యూనియన్ లో చాలా యాక్టివ్ గా పనిచేస్తూ ఉండేవాడు. చదువు అయిపోయాక రాఘవయ్య గారు కొన్నాళ్ళు ఆంధ్రా సిమెంట్ కంపెనీలో పనిచేశారు. అక్కడ నుంచి ఆయన మద్రాస్ వెళ్లి సినిమా రంగానికి సంబంధించిన "ప్రసాద్ పబ్లిసిటీస్"అనే సంస్థను నెలకొల్పి, దాన్ని కొనసాగించారు. అలాగే "శాంతి సినీ పబ్లికేషన్స్" అనే సంస్థను స్థాపించి, దాని తరపున డిటెక్టివ్ నవలలను ప్రచురించారు. ఈలోగా ఆయనకు బెజవాడలో ఆంధ్రజ్యోతి దిన పత్రికలో మేనేజర్ గా వుద్యోగం వస్తే, బెజవాడ వచ్చేసారు. అలా ఆయన ఆంధ్రజ్యోతి దినపత్రిక మేనేజర్ గా పనిచేస్తూ ఉండగా బెజవాడ నుండి ఈ జ్యోతి అనే మాస పత్రికను ప్రారంభించారు అనే ఆలోచన వచ్చింది.

రాఘవయ్య గారికి ఇన్ని మంచి లక్షణాలు ఉండడమే కాకుండా, మంచి వ్యాపార వేత్త. సాహితీ ప్రియులు కాబట్టి ఈ జ్యోతి మాస పత్రికను ప్రారంభిద్దామని అనుకున్నప్పుడు ఒక విన్నూతనమైన ఆలోచన చేశారు. అదేమిటంటే, తాను మేనేజింగ్ డైరెక్టర్ గా ఉండి, అసలు పత్రిక నిర్వహణా, రచనల ఎంపికా, రూప కల్పనా, ఫీచర్స్ నిర్వహణా ఇలాంటి వాటి కోసమని ఒక సంపాదక వర్గం ఏర్పాటు చేసుకున్నారు. ఆ సంపాదక వర్గంలో సభ్యులు ఎవరంటే – బాపుగారూ, ముళ్ళపూడి వెంకటరమణగారూ (అప్పటికి – రమణగారు సినిమా సమీక్షలు రాయడం, వార్తలు రాయడం కొనసాగిస్తూ రచయితగా కూడా మంచి పేరు తెచ్చుకున్నారు. బాపు, రమణ సినీరంగానికి కూడా వెళ్ళలేదు) రావి కొండలరావు గారూ, (ఆ సమయానికి రావి కొండలరావుగారు మద్రాస్ లో ఉండి, నటుడుగా వెళదామా?దర్శకుడిగా వెళదామా?సినిమా జర్నలిస్ట్ గా వెళదామా?అని ప్రయత్నాలు చేస్తున్నారు.) అలాగే మరొక సభ్యులు నండూరి రామ్ మోహనరావు గారు. ఆయన తరవాత రోజుల్లో ప్రముఖ పాత్రికేయులు. అప్పటికి ఆంధ్ర జ్యోతిలో పని చేస్తున్నారు. మనం మాట్లాడుకునే సమయానికి, వీళ్ళ నలుగురు కాకుండా V. A . K. రంగారావు గారిని కూడా చేర్చుకున్నారు.

రాఘవయ్య గారూ, నండూరి రామ్మోహన్ గారూ తప్ప మిగతా అందరూ మద్రాస్ లో ఉండేవారు. అందుకని పత్రిక గురించీ, దాని రూపురేఖల గురించీ, తరవాత నెలలో ఏం రావాలి?ఏమిటి? ఇలాంటివన్నీ కూడా మద్రాస్ లో నిర్ణయం జరుగుతుండేది. వాటిని బెజవాడ లో ప్రింట్ చేసి, పంపిణీ చేస్తుండేవారు. ఈ విషయాల్ని రావి కొండలరావు గారు తన ఆత్మకథ లో ఇలా రాసుకున్నారు .

" ఆరుద్ర గారి డాబా మీద మా సమావేశాలు జరుగుతుండేవి. దాదాపు 15,20 మంది వచ్చేవాళ్ళు. ముచ్చటైన సాయంకాలాలు. రామలక్ష్మి గారు తెలుగు వంటకం దిబ్బరొట్టె, కాఫీ ఇచ్చేవారు. ఆ తరువాత జ్యోతి సంచికలో ఏం

వెయ్యాలి?ఎలా వెయ్యాలి? అనే ఆలోచనలూ, చర్చలూ జరుగుతుండేవి. కొడవటిగంటి కుటుంబరావు గారూ, రామకృష్ణ గారూ భూషణ్ గారూ, దాసరి సుబ్రహ్మణ్యం గారూ ఆ సమావేశంలో పాల్గొంటూ ఉండేవారు“అని.

ఇంత పకడ్బందీ ప్రణాళికలతో జ్యోతి మాసపత్రిక మొట్ట మొదటి సంచిక 1963 ఫిబ్రవరిలో వెలువడింది. దాని ఆవిష్కరణ మాత్రం 1963 జనవరిలోనే అక్కినేని నాగేశ్వరావు గారితో చేయించారు. ఆ సభ గురించిన విశేషాలు జ్యోతి మాస పత్రిక రెండో సంచికలో ఇలా రాసారు.

“విజయవాడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ లో జ్యోతి మాసపత్రిక ప్రారంభోత్సవం జరిగింది. 200 మంది ఆహుతుల సమక్షంలో ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వరావు ప్రారంభోత్సవం చేశారు. ఆంధ్ర జ్యోతి ఎడిటర్ నార్ల వెంకటేశ్వరావు గారు సభకు అధ్యక్షత వహించారు. జ్యోతి ప్రారంభోత్సవ సందర్భంలో పలువులు ప్రముఖులూ, సినీ కళాకారులూ శుభాకంక్షాలు పంపించారు. వారందరికీ మా కృతజ్ఞతలు” అని.

ఇలా ప్రారంభమైన జ్యోతి మాసపత్రిక మొట్ట మొదటి సంచిక నుంచే పాఠకులకు ప్రియమైన పత్రిక అయిపోయింది. ముఖ్య కారణం – అన్నింటా కొత్తదనం. శీర్షికల విషయంలో ముళ్ళపూడి వారి చమత్కారం. బాపుగారి కార్టూన్లు. కథలకు ఆయన వేసిన బొమ్మలు. అన్నిటికీ మించి ఫీచర్స్. ఇవన్నీ కూడా జ్యోతిని మొట్ట మొదటి నుండి కూడా ప్రజలకు దగ్గరయ్యేలాగా చేసింది. కవర్ పేజీమీద కూడా “60 పైసలు చాలు. అదే పది వేలు” అనే టాగ్ లైన్ ఇచ్చారు. ఇలాంటి చమత్కారాలు ముళ్ళపూడి చేసేవారు. అప్పటికే మార్కెట్ లో వున్న ‘యువ ‘ మాస పత్రికలో ఫీచర్స్ దాదాపుగా ఉండేవి కావు. రాజకీయ వార్తలూ, కథలూ, బెంగాలీ వార్తలూ నవల ఇలాంటివి మాత్రమే ఉండేవి.

అదే జ్యోతి విషయానికి వస్తే, లైట్ రీడింగ్, ఆహ్లాదం కోసం అనేక చమక్కులు చేశారు. “టోకున శ్రీశ్రీ జోకులు” అనే శీర్షిక, రావికొండలరావు గారు రాసిన కథ. ఆరుద్రగారి కూనలమ్మ పదాలు. వి.ఎ.కె రంగారావుగారి “మానస ఉల్లాసం” ఉన్నాయి. ఇంకా “మగవారికి మాత్రమే”అని కొడవటి కుటుంబరావు గారి కథ. బాలగంగాధర తిలక్ గారి “ప్రార్ధన”. అనే కవిత. ఇవన్నీ వున్నాయి రెండవ సంచికలో. కవర్ పేజీలు కూడా సినిమా స్టిల్ యధాతధంగా వెయ్యకుండా, దానికి బాపు గారి డిజైనింగ్ తోడయ్యేది.

ఒక్కోసారి చిలిపిగా, ఒక్కోసారి చమత్కారంగా, కళాత్మకంగా మొత్తానికి ఆ జ్యోతి పత్రిక పేజీలు తిరగేస్తుంటే, సరదా సరదాగా ఉండడమే కాకుండా, పాఠకులుగా మనం కూడా పాల్గొనే ఫీచర్స్ చాలా ఉండేవి. ఒక ప్రభంజనంలాగా కొనసాగిన ఈ జ్యోతి మాస పత్రికలో ప్రారంభమై కొనసాగిన కొన్ని ఫీచర్స్ ను గుర్తు చేసుకోవాలంటే, ఆరుద్ర గారి “కూనలమ్మ పదాలు.” నాలుగు లైన్లతో ఎవరో వ్యక్తి గురించి గానీ, ఒక సంఘటన

గురించి గానీ రాస్తూ ఉండేవారు. ఉదాహరణకు బాపు గారి గురించి ఎక్కడ రాసినా అందరూ ఉదాహరించే "కొంటె బొమ్మల బాపు,కొన్ని తరముల సేపు, గుండె ఊయలూపు, ఓ కూనలమ్మ." అలాగే "రెండు శ్రీశ్రీ లు ధరించి, రెండు పెగ్స్ బిగించి, వెలుగు శబ్దం విరించి ఓ కూనలమ్మ" అని శ్రీశ్రీ గారి గురించి, "ఎంకి పాటల దారి, ఎడద గుఱ్ఱపు స్వారి, చేయులే నండూరి... ఓ! కూనలమ్మా!"అని నండూరి సుబ్బారావు గారి గురించి ఇలా.. కూనలమ్మ పదాలు మొట్టమొదటి సంచిక నుండి కొన్ని సంచికల వరకూ సాగాయి.

అలాగే తిక్కవరపు పట్టాభి రామారావు గారని ఒక కవి ఉండేవాడు. ఆయన రాసిన "పఠాభి పంచాంగం" ఇంకో ఆకర్షణ. మినీ కవితలు లాగ ఉండేవి. అవి కూడా మొట్ట మొదటి సంచిక నుండి చాలా నెలలు వచ్చాయి. అలాగే "ప్రపంచ పదులు " పేరుతొ శ్రీశ్రీ గారు రాసిన 5 లైన్ల కవితలు ప్రచురితమయ్యాయి. అవి కూడా తరవాత రోజుల్లో చాలా ప్రసిద్ధి చెందాయి. అందులో కొన్ని...

"కొత్త మంగళం సుబ్బు, పాత చింతకాయ పచ్చడి రుబ్బు, మనకంత తబ్బిబ్బు, అయినా కానీ కవిత్వం కొట్టదు గబ్బు, అది చదివితే హృదయం ఉబ్బు"

"నా ఇంటి పేరు ప్రపంచం, ప్రజలే నా కుటుంబం, వెదజల్లు తాను దిగ్దిగంతం,అభ్యుదయ సుగంధం, అప్పుడు నా జీవితమే ఒక ప్రబంధం... " చాలాసార్లు అనేకమంది శ్రీశ్రీ గారి గురించి ఉదహరించేటప్పుడు, ఈ గేయాన్ని ఉదాహరిస్తుంటారు. ఇదే కాకుండా శ్రీశ్రీగారు జ్యోతి మాసపత్రికలోనే "శ్రీశ్రీ నిర్వహిస్తున్న పదబంధ ప్రహేళిక" అనే లిటరరీ పజిల్ నిర్వహించారు. అప్పటికీ, ఇప్పటికీ కూడా పదబంధ ప్రహేళికలు అంటే శ్రీశ్రీ పద బంధ ప్రహేళికను ప్రామాణికంగా తీసుకుంటుంటారు. ఈ పత్రికలో అది చాలా నెలలు కొనసాగించారు.

ఇవి కాకుండా బాపూ, రమణ గార్లు "కార్ట్యూనులు "అని రాసేవారు. అంటే ఒక వ్యక్తి గురించిగానీ, ఒక సంఘటన గురించి గానీ, తీసుకొని ముళ్ళపూడి రాసేవారు. బాపుగారు బొమ్మలు వేసేవారు. ఆ తరవాత రోజుల్లో చాలాచోట్ల ఈ కార్ట్యూనులు ఎవరి గురించి అయినా చెప్పేటప్పుడు ఇవే వాడుతుండేవారు. అక్కినేని నాగేశ్వరావు, ఎస్వీ రంగారావు, భానుమతి గారి గురించి అలా...

అలాగే వి. ఏ. కే. రంగారావు గారి సంగీత సమీక్షలు ఉండేవి. ఇక బాపు కార్టూన్లు అయితే సరేసరి. కొంటెబొమ్మల బాపు అని ఒక పూర్తి పేజీలో కార్టున్లే ఉండేవి. మొత్తంగా చూసుకుంటే, ప్రతి సంచికా కూడా ఏదో ఒక గిమ్మిక్కు ఉండేది. వీటన్నిటితో పాటుగా సినిమా వార్తలు కూడా ప్రత్యేకంగా కనిపిస్తూ ఉండేవి. బహుశా వీళ్ళందరూ మద్రాస్ లో సినిమారంగానికి దగ్గరగా ఉండడం వల్ల అయివుంటుంది. సినిమా ఇంటర్వ్యూలూ, ప్రత్యేక కథనాలూ ఉండేవి. అప్పట్లో వున్న యువ యువలో అయితే, సినిమా వార్తలు ఏమీ ఉండేవి కావు. ఈ జ్యోతిలో లైట్ రీడింగ్ తో పాటుగా చిట్టచివరలో సినిమా వార్తలు చాలా ఆకర్షణీయంగా వస్తూ ఉండేవి.

తరవాత రోజుల్లో ప్రారంభమై, కొన్ని నెలల పాటు కొనసాగింది ఒక ఫీచర్ కూడా ఈ పత్రికను యువతరం లోకి వెళ్ళడానికి దోహదం చేసింది. అదేమిటంటే కాలేజీ స్టూడెంట్స్ కోసం ప్రత్యేక కథల పోటీలు. "కేవలం కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు మాత్రమే రాయాలి. మీ చదువుతున్న కళాశాల అనుమతి పత్రం జతచేస్తేనే మీ కథను తీసుకుంటాము" అని కూడా ప్రకటించారు. అలా చిన్న కథలూ, పెద్ద కథలూ, ఒక పేజీ కథలూ ఇలాంటివి కూడా చాలా నెలలు కొనసాగించారు.

జ్యోతి మాసపత్రిక గురించి మనం ప్రస్తావించుకునేటప్పుడు ప్రత్యేకంగా చెప్పుకోవలసింది యద్దనపూడి సులోచనా రాణి గారి సీరియల్ నవల "సెక్రటరీ". ఆమె అప్పటివరకూ కేవలం కథలు మాత్రమే రాస్తూండేవారు. జ్యోతి మాసపత్రికలో కూడా సీరియల్స్ అంటూ లేవు. కేవలం కథలూ, కార్టూన్లూ, ఫీచర్స్, ఇలాంటివి మాత్రమే ఉండేవి. అలాంటి నేపథ్యంలో 1964 మే నుంచి మొట్ట మొదటి సీరియల్ జ్యోతిలో మొదలయ్యింది. అది యద్దనపూడి సీరియల్. అది ప్రారంభమైన మొట్ట మొదటి నెలలో కొద్దీ పంక్తులు మాత్రం రాసారు.
"పాఠకుల కోరికపై జ్యోతి కూడా ఈ సంచికతో సీరియల్ మొదలు పెడుతున్నది. అతి కొద్దీ కాలంలోనే పాఠకుల అభిమానాన్ని చూరగొన్న శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి గారు వ్రాసిన ఈ చిన్ని నవల లేదా పెద్ద కథ చదివి మా పఠితలు చదివి ఆనందిస్తారని నమ్ముతున్నాము." అని. అంత మాములుగా మొదలు పెట్టారు. ఎందుకంటే యద్దనపూడి గారు అప్పటికి కథల రచయిత్రిగా మాత్రమే పాఠకులకు తెలుసు. అలాగే ఈ సీరియల్ పాఠకులలోకి ఎలా వెళుతుంది?అనేది వాళ్లకు కూడా తెలీదు. తరవాత అయితే చాలా పెద్ద ప్రకటనలు ఇచ్చారు.

నవల రచయిత్రిగా ఈ సీరియల్ తర్వాత యద్దనపూడి సులోచనారాణి గారు సృష్టించిన రికార్డులు మనకందరికీ తెలిసినవే. ఆ తర్వాత సంవత్సరాల్లో కూడ యద్దనపూడి గారి సీరియల్స్ చాలా వచ్చాయి. ఇంకొక విశేషం ప్రముఖ కవీ, కథా రచయితా దేవరకొండ బాల గంగాధర్ గారి కవితలు జ్యోతి మాస పత్రికలో మొట్ట మొదటినుండి కూడా చాలా తరచూ వస్తుండేవి. ఆయన రచించిన చిట్టచివరి కవిత కూడా ఈ జ్యోతి మాస పత్రికలోనే వచ్చింది. "కాస్మా పాలిటన్, బాల గంగాధర్ తిలక్ "ఆయన రాసిన చిట్ట చివరి కవిత. దురదృష్టం ఆ నెలలోనే ఆయన చనిపోయారు. 1966 ఆగస్టు నెలలో ఆయన గురించి ఒక స్మృతి వ్యాసం రాస్తూ "ఆయన రాసిన చిట్టచివరి కవితను క్రిందటి నెలలోనే ప్రచురించాము.ఈ నెలలోనే ఆయన గురించి ఇలాంటి వ్యాసం వ్రాయాల్సి వస్తోంది. "అని కూడా జ్యోతి మాస పత్రికలో రాసారు.

జ్యోతి మాస పత్రిక లోని మరికొన్ని మైలు రాళ్లను చూసుకుంటే, 1966 చివరి వరకూ సంపాదక వర్గం అనేది కొనసాగింది. 1967 నుండి ఆ సంపాదక వర్గం అనే కాన్సెప్ట్ ఆగిపోయి, రాఘవయ్య గారే అన్ని చూసుకునేవారు. ఇలా ఎందుకు జరిగింది? బాపూ గారూ, రమణ గారూ అందరూ ఎందుకు వెళ్లిపోయారు? తాము అలా ఎందుకు

చేయాల్సి వచ్చింది? ఈ వివరాలన్నీ ముళ్ళపూడి వెంకటరమణ గారు తన కోతి కొమ్మచ్చి "లో రాసుకున్నారు. ఈ జ్యోతి మాస పత్రికలో మానేసాకే బాపూ, రమణ గార్లు మద్రాస్ లో "సాక్షి"సినిమాను రూపొందించడం, అది విజయవంతం కావడం అదంతా వేరే కథ.

అలాగే, రావి కొండలరావుగారు కూడా ఈ జ్యోతి సంపాదక వర్గం నుండి మానేసాక, విజయచిత్ర మాస పత్రికలో సహాయ సంపాదకుడిగా వెళ్లారు. 1968,69 ప్రాంతాల్లోనే అదే సంస్థ నుంచి రాఘవయ్యగారు జ్యోతి రాజకీయ పత్రిక టాబ్లాయిడ్ రూపంలోనూ, అలాగే పత్తేదారు అనే డిటెక్టివ్ మాసపత్రికను కూడా తీసుకువచ్చారు. అవి కూడా నడచినన్ని రోజులూ చాలా వైభవంగా నడిచాయి. జ్యోతి కి వున్న స్టాండర్స్ నే ఆ రెండు పత్రికలు కూడా నిలబెట్టుకున్నాయి.

విజయవాడ కేంద్రంగా కొనసాగుతున్న జ్యోతి మాస పత్రిక కార్యాలయాన్ని 1970 మే లో మద్రాస్ కి మార్చారు. అక్కడకి మార్చిన కొద్ది నెలలకే 1971 ఫిబ్రవరి 1 న రాఘవయ్యగారు, అతి చిన్న వయసులో మరణించారు. అప్పటికి ఆయన వయసు 50 సంవత్సరాలు మాత్రమే. ఆయన మరణించిన నెలలో కూడా క్రమం తప్పకుండా వెలువడిన జ్యోతి మాస పత్రికలో ఇలా రాసారు.

"తానూ కాలిపోతూ, ప్రపంచానికి వెలుగునందించే కొవ్వొత్తిలా, సాహితీ రంగానికి అహర్నిశలూ, నిర్విరామ కృషి చేసి ఫిబ్రవరి 1 వ తేదీన, జ్యోతికీ, జ్యోతి పాఠకలోకానికి శాశ్వతంగా దూరమైన కీర్తి శేషులు వి.వి. రాఘవయ్య గారికి నిష్కల్మషమైన హృదయంతో, వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ... భక్తి పూర్వకంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము"అని. అదే సంచికలో రాఘవయ్య గారి పట్ల ఎంతో గౌరభిమానాలు ఉన్న మరికొంత మంది కూడా తమ సందేశాలు రాసారు.

దాశరధిగారూ, యద్దనపూడి సులోచనారాణి గారూ, రాఘవయ్య గారి గురించి తమ జ్ఞాపకాలు రాసారు. జ్యోతి సక్రమంగా నడపడమే రాఘవయ్య గారి ఆత్మకు శాంతి అని యద్దనపూడి సులోచనారాణి గారు రాస్తూ... "శ్రీమతి లీలావతమ్మ గారికీ , మీకు నా సానుభూతి ఎలా తెలియజేయాలో మాటలు కూడా రావడం లేదు. ఈ వార్త వినగానే మనసు దిమ్మెరబోయినట్లుంది. మీరు దుఃఖాన్ని పక్కన బెట్టి, పిల్లలకోసం, మాకోసం, పాఠకులకోసం, జ్యోతి నిర్వహణా భారాన్ని పూర్తిగా తీసుకోగలరని నమ్ముతున్నాము. "అన్నారు.

యద్దనపూడి సులోచనా రాణిగారు ఆశించినట్లుగానే, సత్సంకల్పంగా ప్రారంభించిన ప్రణాళికలు, ప్రామాణికతతో నడుస్తాయి అనడానికి ఉదాహరణ రాఘవయ్యగారి మరణం తర్వాత కూడా అదే రీతిలో జ్యోతి మాసపత్రిక కొనసాగడం. రాఘవయ్య గారి సతీమణిలీలావతి రాఘవయ్య గారు పత్రిక సంపాదకత్వ బాధ్యతలను చేపట్టారు. సహకార సంపాదకులు వేరేవేరే ఉండేవారు. వాళ్ళ సహకారంతో జ్యోతిని ఏమాత్రం ఆటంకం లేకుండా ముందుకు

తీసుకువెళ్లారు. ఆ తర్వాత 18 ఏళ్లపాటు లీలావతి రాఘవయ్య గారు జ్యోతి మాస పత్రికకు మేనేజింగ్ ఎడిటర్ గా కొనసాగారు. 1973 వరకు వ్యాస్ చంద్ అనే ఆయన సహకార సంపాదకుడిగా వుండేవాళ్ళు. 1973 నుంచి 6,7 ఏళ్ళపాటు సహకార సంపాదకుడిగా పనిచేశారు వేమూరి సత్యన్నారాయణ గారు. మిత్రులందరూ ఆయన్ని వేమూరి సత్యం గారు అని పిలుస్తుంటారు. స్వతహాగా రచయిత, స్వాతి మాస పత్రిక వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన వేమూరి సత్యంగారు, ఈ జ్యోతి మాస పత్రిక సంపాదక బాధ్యతలు తీసుకునేంత వరకూ, హైదరాబాద్ లో స్వాతి మాస పత్రిక సంపాదకులుగా ఉండేవారు.

వేమూరి సత్యంగారు నాకు సన్నిహితంగా మిత్రులు. తరచూ మాట్లాడుతూ వుంటాను. వాళ్ళ స్వగ్రామం, మా స్వగ్రామం పక్క పక్కనే ఉంటాయి. వారిని సంప్రదించి, ఈ జ్యోతి మాసపత్రిక గురించి చేద్దామనుకున్నప్పుడు చాలా విలువైన సమాచారం సేకరించగలిగాను. ఆయన వున్నన్ని రోజులు కూడా జ్యోతి మాస పత్రికను మరింత ప్రామాణికతతో కొత్త కొత్త ప్రయోగాలతో ముందుకు తీసుకెళ్లారు. ఇంకో విశేషం ఏమిటంటే అవే రోజుల్లో 1974, 75 ప్రాంతాల్లో మల్లాది వెంకట కృష్ణ మూర్తిగారు శరవేగంతో ఎదుగుతున్నారు. ఆయన రచనలేని పత్రిక అంటూ ఉండేది కాదు. జ్యోతి తో సహా. మల్లాది వెంకట కృష్ణ మూర్తిగారు తన స్వానుభవాలతో రాసిన "జరిగిన కథ.– పత్రికా సంపాదకులతో నా అనుభవాలు" అనే పుస్తకంలో ఈ జ్యోతి మాస పత్రిక మద్రాస్ లో ఉండగా అక్కడకు వెళ్ళినపుడు, వేమూరి సత్యం గారితో పరిచయం గురించి, వాళ్ళ స్నేహం గురించి వివరంగా రాసారు. జ్యోతి సంపాదకుడిగా వేమూరి సత్యం గారి నిజాయితీ గురించీ, క్రియేటివిటీ గురించీ చాలా ఉదాహరణలు రాసారు. అందులో ఒకటి. ఇది యదాతథంగా మల్లాది పుస్తకం లోనిది.

"1974 లో సత్యానికీ, నాకూ జ్యోతి మాసపత్రిక గురించి ఒక డ్రీమ్ ప్రాజెక్ట్ ఉండేది. నేను కేవలం టిక్కెట్టుతో, కట్టు బట్టలతో ఢిల్లీ వెళ్లి, అక్కడ కొన్ని రోజులుండీ, అక్కడ నుండి హైదరాబాద్ చేరాలి. కండీషన్ ఏమిటంటే, ఇతరులను మోసం చేసి గానీ, దొంగతనం చేసిగానీ, అడుక్కొని గానీ డబ్బు సంపాదించకుండా వెనక్కి తిరిగి రావాలి. జ్యోతి మాస పత్రిక పాఠకులకు బయలుదేరే రోజు ముందే ప్రకటించి, తరవాత సంచిక నుంచి ఆ అనుభవాలు ప్రకటించాలి. ఒక వేళ నెలలోగా తిరిగి రాలేకపోతే, తరవాత నెలకి అనుభవాలని, ఇష్యూ క్లోజింగ్ డేట్ కి అందేలా నేను పోస్ట్ చెయ్యాలి. ప్రభుత్వ ఉద్యోగిగా వున్న నాకు సరిపడా సెలవు దొరక్క అది సాధ్య పడలేదు."

నిజంగా ఆ ప్రణాళిక గనక జరిగి ఉంటే, జ్యోతి చరిత్రలోనే కాకుండా, తెలుగు పత్రికా రంగంలోనే ఒక మైలు రాయిగా ఉండేది. ఇలా కొనసాగిన జ్యోతి మాస పత్రిక 1980 అక్టోబర్ లో హైదరాబాద్ కు మారింది. వేమూరి సత్యంగారు మద్రాస్ లోనే పోయారు. లీలావతి రాఘవయ్య గారే మేనేజింగ్ ఎడిటరుగా అవే ప్రమాణాలతో నడిచింది. 1982లో ఎన్టీ రామారావుగారు తెలుగుదేశం పార్టీ ని పెట్టినపుడు, ప్రత్యేకమైన ఇంటర్వ్యూని వేశారు.

అందులో కొన్ని ఎన్టీఆర్ చిత్రాలు కూడా వున్నాయి.(ఆసక్తి వున్నవారు యూ ట్యూబ్ చూడండి) 1984, 85 ప్రాంతాల్లో ఒకటి రెండు సార్లు చిక్కడపల్లిలో వున్న జ్యోతి మాస పత్రిక ఆఫీసుకి నేను వ్యక్తిగతంగా వెళ్ళాను. నేను రాసిన ఒకటి, రెండు కవితలు కూడా జ్యోతి మాస పత్రికలో వచ్చాయి.

ఆర్టిస్టు చంద్రగారూ, యండమూరి వీరేంద్రనాథ్ గారూ జ్యోతి మాసపత్రిక రూపకల్పనలో సహాయం చేస్తుండేవారు అని గుర్తు. 1988లో జ్యోతి మాస పత్రిక 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో స్వర్ణోత్సవ సంచికను కూడా ప్రచురించారు. దాని ప్రత్యేకత ఏమిటంటే, స్వర్ణోత్సవ సంచిక అంటే, 25 సంవత్సరాల్లో వచ్చిన వాటిల్లో మంచి రచనల్ని ప్రచురిస్తారు. కానీ, ఈ జ్యోతి మాస పత్రిక స్వర్ణోత్సవ సంచికలో రాఘవయ్యగారు ఉండగా 8 సంవత్సరాల్లో వచ్చిన జ్యోతి మాస పత్రికలో నుండి ఎంపిక చేసిన రచనలతో ప్రత్యేక సంచికను రూపొందించారు. ఆ తరవాత 1989 చివరలో దాట్ల నారాయణ మూర్తిగారూ, 1990 లో భోగాది వెంకట రాయుడు గారూ సంపాదకులుగా కొనసాగింది. సుమారుగా 1990 మొదట్లోనే ఆగిపోయింది.

ఇంకా ఈ జ్యోతి మాస పత్రిక గురించి, మరికొన్ని విశేషాలు ఏమిటంటే, జ్యోతి మాస పత్రిక ప్రారంభమైన 10 ఏళ్ళ తర్వాత, "విజయ" మాస పత్రిక ప్రారంభమైనపుడు వాళ్ళు విడివిడిగా అనుబంధాలు ఇవ్వడం మొదలెట్టారు. కథలకు ఒక పత్రికా, నవలలకు ఒక పత్రికా, హాస్య ఒక పత్రికా ఇలాగా... ఆ సంప్రదాయాన్ని మిగతా పత్రికలు కూడా కొనసాగించాయి. అదే త్రోవలో1979, 80 ప్రాంతాల్లో జ్యోతి మాస పత్రిక కూడా నవలానుబంధాన్ని కొనసాగించింది. అలాగే ఈ పత్రిక గురించి మాట్లాడుకునేటప్పుడు తప్పక గుర్తు చేసుకోవలసింది "దీపావళి ప్రత్యేక సంచిక".

ఈ జ్యోతి ప్రారంభమైన 1963 నవంబర్ నుంచే దీపావళి ప్రత్యేక సంచికలు కూడా మొదలయ్యాయి. అసలు యువ ప్రారంభించింది ఈ దీపావళి ప్రత్యేక సంచికల సాంప్రదాయం. 300 పేజీలతో. అదే త్రోవలో జ్యోతి కూడా కొనసాగింది. లోగడ చెప్పుకున్నట్లుగానే ఆ సంవత్సరాల్లో దీపావళి అంటే, యువ, జ్యోతి, జ్యోతి వీక్లీ . వీటి ప్రత్యేక సంచికలు మార్కెట్లో కళకళ లాడుతూ కనిపించేవి. బాపుగారి ముఖ చిత్రాలు ఒక ప్రత్యేక ఆకర్షణలుగా ఉండేవి. 1980 లలో ఆర్టిస్ట్ చంద్ర గారి ముఖ చిత్రాలు కూడా వస్తూ ఉండేవి. ఈ దీపావళి ప్రత్యేక సంచికలు జ్యోతి మాస పత్రిక ఆగిపోయే వరకూ క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం విడుదల కావడం అనేది గమనించదగ్గ విషయం.

ఇవండీ 1960 దశాబ్దం మొదట్లో ప్రారంభం అయి 25 ఏళ్ళు పైగా విజయవంతంగా కొనసాగిన జ్యోతి మాస పత్రిక విశేషాలు. ఆధునిక కథా,నవలా సాహిత్యంలో ఉత్తమమైన రచనలు ప్రచురించిన పత్రికగా జ్యోతి మాస పత్రికకు తెలుగు పత్రికల చరిత్రలో ప్రత్యేకమైన స్థానం ఉంటుంది అనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

ఈ వరసలో మనం విశేషాలు తెలుసుకోబోయే తరవాత పత్రిక “జయశ్రీ”మాస పత్రిక. 1960 దశాబ్దం లోనూ, ఆ తరవాత దశాబ్దాలలోనూ కథల మాస పత్రికలు అంటే ప్రముఖంగా వినిపించే పేర్లు యువ, జ్యోతి, జయశ్రీ . ఆ తరవాత స్వాతీ, విజయా మాసపత్రికలు వచ్చాయి. యువ, జ్యోతి మాస పత్రికల త్రోవలోనే విజయవాడ కేంద్రంగా ప్రారంభమైంది జయశ్రీ మాస పత్రిక. 1965 జూన్ లోమొట్ట మొదటి సంచిక విడుదల అయింది. దీని వ్యవస్థాపకులు మొవ్వా రామ్మోహనరావు గారు . జ్యోతి రాఘవయ్యగారి లాగానే, రామ్మోహనరావు గారు కూడా మంచి సాహిత్యాభిలాషి. చక్కటి వ్యాపారవేత్త. మొదట విజయవాడలో 1964 సెప్టెంబర్ లో జయశ్రీ అనే పబ్లిషింగ్ సంస్థను ప్రారంభించారు. దాన్ని అప్పటి రాష్ట్రన్యాయ శాఖా మంత్రి పి. వి.నరసింహారావు ప్రారంభించారు.

ఆ ప్రాంభించినపుడే దాని తరపున “జయశ్రీ “అనే రాజకీయ వార పత్రికను టాబ్లాయిడ్ రూపంలో తీసుకు వచ్చారు. అది వచ్చిన కొద్ది నెలలకి 1965 జూన్ లో జయశ్రీ మాస పత్రికను ప్రారంభించారు. జయశ్రీ మాస పత్రిక, మిగతా పత్రికలతో పోలిస్తే, జ్యోతి మాస పత్రిక ఛాయలతో కొనసాగింది అని చెప్పుకోవచ్చు. ఈ పత్రిక సంపాదక వర్గంలో పనిచేసిన మిత్రులూ, రచయితా, మెజీషియన్, పలు పత్రికల వ్యవస్థాపకులూ, సంపాదకులూ చొక్కాపు వెంకటరమణ గారు జయశ్రీ గురించి చాలా సమాచారాన్ని నాకు అందించారు. ఆయన ఆ పత్రికలో 1971 నుండి 78 వరకూ పని చేశారు. మొదటి నుండి జయశ్రీ మాస పత్రిక కథలూ, శీర్షికలూ, సీరియల్సూ సినిమా వార్తలూ, సంక్షిప్త రాజకీయ వార్తలూ వీటితో వుంటుండేది. అప్పుడప్పుడూ ప్రత్యేక వ్యాసాలు కూడా ఉండేవి.

ఆ రోజుల్లో వున్న ప్రముఖ రచయితలందరూ జయశ్రీ మాస పత్రికలో వ్రాస్తూండేవారు. 1976 ప్రాంతాల్లోనే నేను రాసిన కొన్ని కవితలు కూడా జయశ్రీలో వచ్చాయి. అప్పట్లో నాకు పదో, పదిహేనో రూపాయల మనియార్డరు పంపించిన గుర్తు వుంది. ఇంతకీ ఈ జయశ్రీ మాస పత్రిక సంపాదకులు ఎవరు? ”ఎడిటర్ సుధానిధి” అని ఉండేది. ఈ సుధానిధి గారు వ్రాసిన సంపాదకీయాలు పాఠకులతో సంభాషిస్తున్నట్టుగా ఉండేవి. ఎవరీ సుధానిధి?ఆయన ఇంకేం రచనలు చేశారు?ఎక్కడుంటారు?ఏ సమావేశంలోనూ కనిపించరేమిటి? ఇలాంటి సందేహాలు ఆ రోజుల్లో చాలా మందికి వస్తుండేవి. దీనికి కారణం సుధానిధి అన్న వ్యక్తి ఎవరూ లేకపోవడమే. అదొక పేరు మాత్రమే. జయశ్రీ సంపాదకత్వ శాఖలో ఎవరు పనిచేసి, ఎవరు వెళ్ళిపోయి, ఎవరు వచ్చినా ఎడిటర్ పేరు మాత్రం సుధానిధి అని ఉండేది. చిట్టచివరి వరకూ అలాగే కొనసాగింది.

జయశ్రీ మాస పత్రికను విజయవంతంగా కొనసాగిస్తున్న రోజుల్లోనే రామ్మోహనరావు గారు “శ్రీమతులు “అనే స్త్రీల పత్రికను ప్రారంభించారు. దానికి గౌరవ సంపాదకురాలిగా ప్రముఖ రచయిత్రి తెన్నేటి హేమలత గారు ఉండేవారు. అది కూడా ఎక్కువ సంవత్సరాలు నడవలేదనుకుంటాను. జయశ్రీ వారపత్రిక జయశ్రీ మాసపత్రిక కంటే ముందే ఉందని తెలుసుకున్నాం కదా! అది సుమారుగా 10 ఏళ్ల పాటు నడిచింది. ఆ తరువాత “జనత “అనే

సాయంకాలం దినపత్రికను కూడా ప్రారంభించారు. జయశ్రీ సంస్థ నుండి మిగతా పత్రికలన్నీ ఆగిపోయినప్పటికీ ఈ "జనత" సాయంకాలం పత్రిక మాత్రం ఇంకా నడుస్తున్నట్టుగా నా దగ్గర వున్న సమాచారం.

జయశ్రీ మాసపత్రిక గురించి చెప్పుకునేటప్పుడు ప్రత్యేకంగా చెప్పుకోవలసినది ఒకటి వున్నది. అదేమిటంటే కవిసామ్రాట్ విశ్వనాథ సత్యన్నారాయణగారి చిట్టచివరి సీరియల్ 1976 నుండి మొదలయ్యింది "కుక్క గొడుగులు" అనే సీరియల్. విశ్వనాథ వారు ఏ రచన అయినా డిక్టేట్ చెయ్యడమే గానీ, పేపరు మీద పెన్ను పెట్టి రాసేవారు కాదు. ఈ కుక్క గొడుగులు సీరియల్ నవల కూడా ఆయన చెబుతుంటే రాసుకున్నది చొక్కాపు వెంకటరమణ గారు. అదే జయశ్రీ పత్రిక గురించి ఒక ప్రత్యేక విశేషం.

అప్పట్లో అని పత్రికలూ దీపావళి ప్రత్యేక సంచికలు వెలువరిస్తుంటే, జయశ్రీ మాత్రం పెద్ద సైజులో, 300 పేజీలతో సంక్రాంతి సంచిక వెలువరించేది. ఇతర పత్రికల దీపావళి ప్రత్యేక సంచికల లాగే, జయశ్రీ సంక్రాంతి ప్రత్యేక సంచిక కూడా పాఠకులకు విందు భోజనం లాగ ఉండేది. అలా కొనసాగిన జయశ్రీ 1989లో రజతోత్సవ సంచికను కూడా విడుదల చేసింది. అప్పటికి అవనిగడ్డ సూర్య ప్రకాష్ అందులో అసోసియేట్ ఎడిటర్ గా వున్నారు. ఆ తరువాత ఎక్కువ రోజులు ఈ జయశ్రీ మాస పత్రిక కొనసాగిన దాఖలాలు లేవు. విచిత్రం ఏమిటంటే అప్పట్లో ప్రారంభమైన యువ, జ్యోతి, ఆ తరవాత వచ్చిన విజయ ఈ మాస పత్రికలన్నీ కూడా 1990 లలో కాస్త అటు ఇటుగా మూత పడిపోవడం. కానీ, 1970 లలో ప్రారంభమైన స్వాతి మాసపత్రిక మాత్రం గత 50 సంవత్సరాలుగా నిరాటంకం కొనసాగుతున్నది.

కాలక్రమంలో తరవాత మనం తెలుసుకోబోయే పత్రిక విజయచిత్ర. 1966 జూలై నుంచి 1994 అక్టోబర్ వరకూ 28 సంవత్సరాలు అత్యున్నత ప్రమాణాలతో నడచిన తెలుగు సినిమా మాసపత్రిక విజయచిత్ర. ఆ ముప్పయి ఏళ్లలో తెలుగు సినిమా రంగంలో ఎన్ని మార్పులు జరిగినా, ఎన్ని తరాలు మారినా, ప్రేక్షకుల అభిరుచుల్లో ఎన్ని మార్పులు వచ్చినా, ఇంకా ఎన్ని సినిమా పత్రికలు పోటీగా వచ్చినా, నమ్మిన విలువల కోసమే చివరి వరకూ నిలిచిన పత్రిక విజయచిత్ర.

మొట్టమొదటి సంచికలోనే స్పష్టంగా చెప్పారు "విజయచిత్ర వున్న మంచినే చెబుతుంది. వున్నా చెడు చెప్పదు"అని. ఇప్పటికి కూడా విజయచిత్ర పత్రిక గురించి ఎవరు మాట్లాడినా గానీ, ఈ మాటల్ని ప్రత్యేకంగా పేర్కొంటూ వుంటారు. నేను 10 సంవత్సరాలుగా ప్రసారం చేస్తున్న టాక్ షో లకు కూడా ఈ వ్యాఖ్యలనే ప్రాతిపదికగా ఎంచుకున్నాను. అంత విస్పష్టమైన ఆశయాలతో ప్రారంభించి, అదే ప్రమాణాలతో కొనసాగించబట్టే, ఇప్పటికి కూడా మంచి సినిమా పత్రిక అనగానే గుర్తుకు వచ్చే పేరు విజయచిత్ర. అయితే ఏదైనా, ఎవరైనా కాలం చెప్పే తీర్పుకి బద్ధులమే కాబట్టి, 1994 వచ్చేసరికి విజయచిత్ర పత్రిక కూడా మూత పడక తప్పలేదు.

ఇక, విజయచిత్ర పత్రిక నేపథ్యానికి వెళితే, తెలుగు సినిమా చరిత్రలోనూ, తెలుగు పత్రికల చరిత్ర లోనూ, సువర్ణధ్యాలయను స్వంతం చేసుకున్నది విజయా సంస్థ. ఆ సంస్థ నుండి మొదలయ్యిందే విజయచిత్ర. విజయా సంస్థ అనగానే గుర్తుకు వచ్చేది నాగిరెడ్డిగారూ, చక్రపాణిగారూ. గత భాగాల్లో చెప్పుకున్నాం వీళ్లిద్దరి సారధ్యంలో వచ్చిన పత్రికలు ఆంధ్రజ్యోతి మాస పత్రిక, యువ మాసపత్రిక, కినిమా సినిమా మాసపత్రిక, చందమామ పిల్లల మాసపత్రిక. వీటిలో చందమామ తప్ప మిగిలిన పత్రికలన్నీ 5,6 సంవత్సరాల లోపే ఆగిపోయాయి. మనం మాట్లాడుకుంటున్న 1965 ప్రాంతాలకు వస్తే, ఆ సంస్థ నుండి వస్తున్న పిల్లల మాస పత్రిక ఒక్కటే, అప్పటికి 13 భాషల్లో వస్తున్నది. చక్రపాణి గారేమో హైదరాబాద్ నుండి స్వంతంగా యువ మాస పత్రికను ప్రారంభించి, కొనసాగిస్తున్నారు.

ఆ రోజుల్లో సి.వి. శ్రీధర్ అని నిర్మాతా, దర్శకుడూ ఉండేవాడు. తెలుగులో కూడా మనసే మందిరం లాంటి సినిమాలను రూపొందించాడు. ఆయన ఒక రోజు నాగిరెడ్డి గారి అబ్బాయి వేణుగోపాల్ తో మాట్లాడుతూ,

“సినిమా పరిశ్రమలోనూ, పత్రిక రంగంలోనూ ఉంటూ కూడా, మీ సంస్థ నుండి సినిమా పత్రిక లేకపోవడం వెలితిగా వుంది. ఇండియన్ ఎక్స్ ప్రెస్ వారి స్క్రీన్ పత్రిక లాగా తమిళంలో ఒక పత్రికను తీసుకు వస్తే ఎలా ఉంటుంది? “ అని ప్రతిపాదించాడు. ఇండియన్ ఎక్స్ ప్రెస్ నుండి వస్తున్న స్క్రీన్ వార్తాపత్రికల సైజులో ఉండి, ఎక్కువగా బ్లాక్&వైట్ లోనే ఉండేది. వేణుగోపాల్ రెడ్డి గారు సాధ్యాసాధ్యాలు పరిశీలించారు గానీ, ఆ ప్రయత్నాలు ఎందుకో ముందుకు వెళ్ళలేదు. ఈ లోగా దర్శకుడు శ్రీధర్ గారు చిత్రాలయ అనే పత్రికను ఆయన సొంతంగా ప్రారంభించారు. ఇది జరిగిన కొద్ది నెలలకి వేణుగోపాలరెడ్డి గారు తన అన్నదమ్ములతో మాట్లాడుతూ...

“మనం తెలుగు, తమిళ భాషల్లో స్క్రీన్ లాగా బ్లాక్&వైట్ లో కాకుండా రంగుల్లో సినిమాపత్రిక తీసుకువద్దాము”అన్నారు. దానికి అన్నదమ్ములు అందరూ “సరే”అన్నారు. 1966 మార్చి నెల చందమామలో ఒక పత్రికా ప్రకటన చేశారు.

“త్వరలో వెలువడనున్న అత్యుత్తమ సినీ మాస పత్రిక.

? ? ?

కళాన్వితమైన ఈ తెలుగు పత్రికకు మీరు చక్కని ఆకర్షవంతమైన పేరు సూచించండి. ఆమోదించబడిన సూచనకు బహుమానం 116 రూపాయలు. మరియు ఒక సాలు చందా ఉచితం. ఈ పోటీలో పాల్గొనదలచినవారు ఈ క్రింది కూపను నింపి మార్చి నెలాఖరు లోగా పోస్ట్ చెయ్యండి. ఒక్కొక్క కూపను లోనూ రెండు పేర్లు సూచించవచ్చును. “ఇంకా ..

“నూతన సినిమా పత్రిక నామకరణం 1.... 2... “

క్రింద అడ్రస్: చందమామ పబ్లికేషన్స్, బాక్స్:3, వడపళని, మద్రాస్ –26.

ఆ ప్రకటన వచ్చాక వేలాదిగా ఎంట్రీలు వెళ్లాయి. ఒకటి, రెండు నెలలకే అందులోనుండి ఎంపిక చేయబడ్డ పేరు చెప్పారు.

సంతోష వార్త

చందమామ 1966 సంచికలో ప్రచురించబడ్డ సినీ మాస పత్రిక నామకరణ పోటీలో గడువు తేదీ నాటికి 5865 మంది పాఠకులు పాల్గొన్నారు. వీరికి మా కృతజ్ఞత. ఇందులో ఒకే ఒకరు సూచించిన

విజయచిత్ర

అనే పేరును ఎన్నుకోవడం జరిగింది. ఈ పేరును సూచించిన సోదరికి మా హృదయ పూర్వక అభినందనలు. గెలుపొందినవారు శ్రీ మైలవరపు జానకీదేవి కేరాఫ్ సోమినేని వెంకట్రావు గారు, ప్లీడరు, ఇన్నీసు పేట రాజమండ్రి.

గెలుపొందిన ఆమెకు బహుమాన పైకం 116 రూపాయలు పంపబడును. పైగా ఒక సంవత్సరం వరకు విజయచిత్ర ఉచితంగా పంపబడును.

అదండీ మనం మాట్లాడుకుంటున్న "విజయచిత్ర ... విజయచిత్ర... "అని మాట్లాడుకుంటున్న పత్రిక పేరు పెట్టినావిడ పేరు మైలవరపు జానకీదేవిగారు. ఆలా మొదలైంది విజయచిత్ర. దీనికోసమని ప్రత్యేకంగా డాల్టన్ పబ్లికేషన్స్ అనే సంస్థను కూడా ప్రారంభించారు నాగిరెడ్డిగారి కుమారులు. వాళ్లకు అప్పటికే ప్రెస్ వుంది. రంగుల్లో ముద్రించే టెక్నాలజీ వుంది. మౌలికమైన సదుపాయాలు వున్నాయి. కానీ, పత్రికను నడిపేదెవరు? అధికార సంపాదకుడిగా నాగిరెడ్డి గారి అబ్బాయి విశ్వనాథ రెడ్డి (విశ్వంగారు అనేవారు)వున్నారు.

మరి క్షేత్ర స్థాయిలో పనిచేస్తూ, వ్యాసాలు రాస్తూ, పత్రికల రూపురేఖలు చూడ్డానికి ఎవరైనా కావాలి. అలాంటి వారు ఎక్కడ దొరుకుతారు? అని అన్వేషించడం మొదలెట్టారు. అప్పటికి ఆ పత్రికలో సినిమా అనుభవం వున్నవాళ్లు ఇద్దరే. చక్రపాణిగారూ, కొడవటిగంటికుటుంబరావు గారూ. ఆ ఇద్దరూ కూడా యువ, చందమామ పత్రికలతో తీరిక లేకుండా వున్నారు. "ఎవరైనా సమర్ధుడైన వ్యక్తిని చూడండి. ప్రతిభ ఉండి, నమ్మకంతో, అంకిత భావంతో పనిచెయ్యగలిగితే చాలు. జర్నలిస్ట్ గా విశేషమైన అనుభవం ఉండనక్కరలేదు. మన గైడెన్స్ ఉంటుంది కాబట్టి చెప్పి చేయించుకుందాము"అని చెప్పారు విశ్వనాథ రెడ్డిగారు.

ఆ బాధ్యత తీసుకున్నారు కొడవటిగంటి. ఆయనకు ఒక కుర్రవాడు గుర్తుకువచ్చాడు. ఆ కుర్రాడి వయసు 30 ఏళ్ళు ఉంటుంది. చాలా చురుకైనవాడు. అప్పటికే చాలా సినిమా పత్రికల్లో వ్యాసాలు రాయడమే కాకుండా, "సినీప్రభ " అనే సినిమా పత్రికలో అనధికార ఎడిటర్ గా కూడా కొంత కాలం పని చేసాడు. ఈ అన్వేషణ జరిగే సమయానికి ఆ కుర్రాడు, కొడవటిగంటిని కలవడానికి ఒకరోజు అనుకోకుండా చందమామ ఆఫీసుకు వెళ్లారు. ఆయన ఆ కుర్రవాడిని చూడగానే..

"రండి... రండి... సరిగ్గా మీగురించే అనుకుంటున్నాము. మీరే వచ్చారు"అన్నారు. అప్పుడు కొడవటిగంటి చెప్పారు "మా వాళ్ళు ఒక సినిమా పత్రిక ప్రారంభించాలని అనుకుంటున్నారు. దీనికీ నాగిరెడ్డి, చక్రపాణి లకు ఏమీ సంబంధం లేదు. నాగిరెడ్డి అబ్బాయిలు మాత్రమే నడుపుతున్నారు. పత్రికను సక్రమం నడపడానికి ఎవరినైనా చూడండి. అన్నారు నేనూ, దాసరి సుబ్రహ్మణ్యం గారూ మీ పేరు చెబుదామని అనుకున్నాము. మీరు చెయ్యగలరా?"అని ఆ కుర్రవాడిని అడిగారు. ఆ కుర్రవాడికి చాలా ఆశ్చర్యం వేసింది. ఎంతటి సదవకాశం అని . అప్పటికి ఆ కుర్రవాడు సినిమా రంగంలో ఎలా నిలదొక్కుకోవాలా? అని ప్రయత్నాలు చేస్తున్నాడు. ఒక వైపు నటనలోకి వెళదామా?దర్శకత్వం లోకి వెళదామా? సినిమా జర్నలిస్ట్ గా వెళదామా? అని అనేక ఆలోచనలతో వున్నాడు. అలాటి సమయంలో ఈ అవకాశం వచ్చింది. ఆయన ఎవరో కాదండి ఇటీవలే మన మధ్యనుండి వెళ్ళిపోయిన రావి కొండలరావుగారు. ఆయన వెంటనే ఒప్పుకున్నారు.

కొడవటిగంటి కుటుంబరావు గారు ఆయన్ని వెంటనే నాగిరెడ్డిగారి పెద్దబ్బాయి ప్రసాద్ గారి గదికి తీసుకువెళ్లారు. ఆ ప్రసాద్ గారేమో మిగతా తమ్ముళ్లని పిలిపించారు. అందరూ కలసి రావి కొండలరావు గారిని ఇంటర్వ్యూ చెయ్యడం అంటే, మాట్లాడ్డం మొదలయ్యింది. ఆయన దగ్గర విశేషాలు కనుక్కున్నారు. రావికొండలరావు గారు అప్పటి వరకూ చేసిన పనులన్నీ కూడా చెప్పారు.

"సరే! మేం మిగతా కొంత మందితో కూడా మాట్లాడుతున్నాం. మీకు త్వరలో చెబుతాం. మీరు వెళ్ళండి"అన్నారు. రావికొండలరావు గారు వచ్చేసారు గానీ ఈ అవకాశం వస్తే బాగుండును అనుకున్నారు. అయితే, ఇంకా సీనియర్ జర్నలిస్ట్ లు వున్నారు కదా! నాకు వస్తుందో, రాదో అని కూడా అనుకున్నారు. 4,5 రోజుల తర్వాత కొడవటిగంటి కుటుంబరావు గారూ, భక్తవత్సల రెడ్డిగారని నాగిరెడ్డిగారి బంధువు. ఆయనే కె.వి.ఆర్. భక్త అనే పేరుతో విజయచిత్రలో బ్రహ్మాండమైన వర్ణ చిత్రాలు ప్రచురించారు. వాళ్లిద్దరూ రావి కొండలరావు గారి ఇంటి దగ్గరకు వచ్చి "మిమ్మల్ని తీసుకురమ్మన్నారు"అని తీసుకువచ్చి, అప్పుడు చెప్పారు "మీరే మా విజయచిత్ర పత్రికను చూస్తున్నారు"అని.

ఆ సందర్భంలోనే వేణుగోపాల రెడ్డిగారూ, విశ్వనాధ రెడ్డిగారూ , రావి కొండలరావుగారిని అడిగారట"ఆంధ్ర జ్యోతికి రాస్తున్నారు కదా! మీకిప్పుడు నెలకి ఎంత వస్తుంది?" అని. "వారానికి 25 ఇస్తారు. అంటే 5 వారాలు అయితే 125 వస్తుంది "అన్నారు.

"అయితే మేము నెలకి 150 రూపాయలు ఇస్తాము. మీరు ఆఫీసుకి రావాల్సిన పనిలేదు. ఇది మాసపత్రిక కాబట్టి, అనుకున్న వ్యాసాలు రాసి ఇస్తే చాలు." అన్నారు. అప్పుడు రావికొండలరావు గారు అన్నారు "కేవలం రాసి ఇవ్వడం కాదండి. తప్పుఒప్పులు చూస్తాను. పైగా ఆఫ్ సెట్ ప్రింటింగ్ అంటున్నారు. (అప్పట్లో లేటెస్ట్ అన్నమాట)నేనే

దగ్గరుండి అన్నీ చూస్తాను. కాకపోతే, ఒక విషయం, ఇప్పుడిప్పుడే సినిమాలలో వేషాల కోసం ప్రయత్నిస్తున్నాను. మరి ఆ వేషాలు వస్తే, మీకు అభ్యంతరం ఉంటుందేమో?" అన్నారు. అప్పుడు నాగిరెడ్డి గారి అబ్బాయిలు చెప్పారు.

"మీరు ఏపనైనా చేసుకోండి. మాకు సమయానికి వ్యాసాలు రాసి ఇస్తే సరిపోతుంది. ఇది మాస పత్రిక కదా!"

"ఈ పత్రిక విధానాలు ఏమిటి?"

"మనం ఎవరిగురించి పొగుడుతూ వ్రాయం. పరిశ్రమలో అందరూ మనకి ఒకటే. మా విజయా సంస్థ గురించే వ్రాయాలని ఏమీ లేదు. అందుకనే మా మొట్ట మొదటి సంచిక ముఖచిత్రంగా మా చిత్రాలతో సంబంధం లేకుండా, "దేవిక" బొమ్మ వేద్దాం అనుకుంటున్నాం. మంచి వ్యాసాలూ, పరిశ్రమకు పనికివచ్చేవీ, పాఠకులకు ఉత్సాహంగా ఉండేవీ ఉండాలి. దానికి తగినట్టు ఎలాంటి వ్యాసాలూ, శీర్షికలూ వేస్తే బాగుంటుందో చూడండి." అని చెప్పారు.

రావి కొండలరావుగారూ, కొడవటిగంటి కుటుంబరావు గారూ కూర్చొని కొన్ని శీర్షికలు చూపించారు. వాళ్లకి కూడా అవి నచ్చాయి. వాళ్ళు కూడా కొన్ని విషయాలు చెప్పారు. "నేటివీ, నాటివీ కూడా ఉండాలి. "అని.

ఇలా 1966 మే నెలనుంచి ఆలోచనలూ, రచనలూ మొదలై 1966 జూలైలో మొట్ట మొదటి సంచిక విజయచిత్ర మాస పత్రిక మార్కెట్ లోకి విడుదల అయ్యింది. నాగిరెడ్డిగారు మొదటి సంచిక ఆవిష్కరించారు. విడుదల అయిన రెండో రోజుకే మార్కెట్లో ఎక్కడా కాపీలు లేవు. వెల 75 పైసలు. మొట్టమొదటి సంపాదకీయంలో ఇలా రాసారు.

"ఇంద్ర ధనస్సు, రంగురంగుల పువ్వులూ, చక్కని ప్రకృతి, చిక్కని వెన్నెల, సాయంకాలపు సముద్ర తీరం, సెలయేళ్ళు, ఇవన్నీ మనసుకు ఆహ్లాదం కలిగిస్తాయి. అందుకనే అవంటే అందరూ ఇష్టపడతారు. ఇటువంటి ఆహ్లాదంతో పాటు, కాస్త విజ్ఞానం కూడా కలగజేయడం విజయచిత్ర లక్ష్యం. ఇప్పుడున్న సినిమా పత్రికలకు తోడుగా అందమైన సినిమా పత్రికను వెలువరించాలనే ఉద్దేశ్యమే విజయచిత్ర ఆవిష్కరణకు కారణం. యావత్తు సినిమా పరిశ్రమకు పాఠక ప్రపంచానికీ అంకితమైన విజయచిత్రలో పక్షపాతానికీ, మొహమాటానికీ, అసభ్యమైన, అవాచ్యమైన రాతలకూ తావులేదు. విజయచిత్ర వున్న మంచినే చెబుతుంది. వున్నా చెడు చెప్పదు. పురోగమిస్తున్న సినిమా పరిశ్రమకు ఉడతా భక్తిగా సేవచెయ్యగలిగితే, అంత కంటే మహద్భాగ్యం మరొకటి ఉండదు. రావాల్సిన విజయచిత్ర వచ్చింది. కావలసినవి ఏమిటో చెప్పవలసింది పాఠకులే. శుభాకాంక్షలు అందజేసిన పాఠకులకూ, అభిమానులకూ, విజయచిత్ర కృతజ్ఞతలు తెలిజేసుకొంటున్నది. —— సంపాదకుడు ... విశ్వం. సహాయకుడు– రావి కొండలరావు. "

ఒక్క మెతుకు పట్టుకుంటే చాలు అన్నం ఉడికిందో, లేదో చెప్పొచ్చు అన్నట్లు, విజయచిత్ర మొట్టమొదటి సంచికే ఆ పత్రిక భవిష్యత్తుకి అద్దం పట్టింది అని చెప్పుకోవచ్చు. మొట్టమొదటి సంచికలో కొన్ని విశేషాలు– తెరవెనుక అనే శీర్షికలో సి. పుల్లయ్య గారి గురించిన వ్యాసం. భక్త పోతన సినిమా కథ. అలాగే గోవిందరాజుల సుబ్బారావుగారు

సంస్మరణ. హిందీ చిత్ర రంగ విశేషాలు. వీటితో పాటుగా ముఖ చిత్రం మీద వున్న దేవిక పూర్తి పేజీ వర్ణచిత్రం. అలాగే N. T .R , A. N .R, ఇద్దరూ నిలుచున్నటువంటి రంగుల చిత్రం. నూతన నటుడు "చంద్రమోహన్"అని ఆయన వర్ణ చిత్రం. ఇలాంటివి అన్నీ వున్నాయి. స్టూడియో సంచారం, నిర్మాణంలో వున్న సినిమా విశేషాలు వున్నాయి. విజయచిత్ర మొట్ట మొదటి సంచికే కొత్తగా అనిపించడానికి కొన్ని కారణాలు వున్నాయి.

మొదటి కారణం ఆ పత్రిక సైజు. అప్పటివరకూ ఏ పత్రికా రాలేదు. చందమామ కూడా అలాగే అంత వరకూ రాని ఎక్సరసైజు నోటు పుస్తకం సైజులో డిజైన్ చేసినట్లు గానే, వీక్లి సైజుకి కొంచెం తక్కువగా, కొంచెం వెడల్పుగా రూపొందించారు. రెండోది పూర్తి పేజీ వర్ణ చిత్రాలు. అన్నిటికీ మించి నాణ్యమైన ముద్రణా, ఖరీదైన పేజీలు. ఇదంతా ఒక ఎత్తయితే, లోపల కబుర్లూ, వ్యాసాలూ, ఇటు వినోదాన్ని, ఇంకో వైపు విజ్ఞానాన్ని కలిగించేటట్లు వున్నాయి. సినిమా స్టిల్స్ లోని ప్రత్యేకత ఒరిజినల్ ఫోటోలు చూస్తున్న అనుభూతిని కలిగించేది. విడుదల అయిన రెండో రోజుకే మార్కెట్లో కాపీలన్నీ అయిపోయిన దూకుడు చాలా సంవత్సరాలు కొనసాగించింది.

రెండో సంచిక సావిత్రిగారి ముఖ చిత్రంతో విడుదలయ్యింది. లోపల "వీజీ, సతీష్, నేనూ, ఆయనా "అంటూ సావిత్రిగారు రాసిన వ్యాసం ఒకటి వుంది. ఈ బొమ్మలో తోపుడు బండిలో కూర్చున్నవాడే సావిత్రిగారి అబ్బాయి సతీష్. ప్రస్తుతం ఆయన వయసు 55 సంవత్సరాలు దాటాయి. 4,5 సంవత్సరాల క్రిందట ఈ పేజీ ఆయనకు మెయిల్ లో పంపించాను. అది చూసి చాలా సంతోషపడ్డారు. తన 28 ఏళ్ళ ప్రస్థానంలో విజయచిత్ర పత్రిక అనేక చారిత్రాత్మక సన్నివేశాలను రికార్డ్ చేసింది. 1967 జనవరిలో N. T . రామారావు గారు స్వదస్తూరితో రాసిన లేఖ వున్నది. ఇప్పటికి కూడా ఎన్టీఆర్ గారి చేతి రాత  అనగానే చాలా మంది విజయచిత్ర లోని ఈ పేజీలనే ఉదహరిస్తుంటారు.

అదే సంచికలో గుమ్మడి గారు రాసిన"రష్యా యాత్ర" అనే ధారావాహిక కూడా వుంది. 1967 జూలై అంటే మొట్టమొదటి జన్మదిన సంచిక దాంట్లో ఇలా రాసారు. "సంవత్సరం గడచింది. విజయ చిత్ర 12 సంచికలనూ మీరు ఆదరించారు. అద్భుతమైన పత్రికగా తీసుకువచ్చామని గానీ, అందమైన పత్రికను మీకు అందించామని గానీ, పరిశ్రమను మేము ఉద్ధరించామని గానీ, మేము చెప్పుకోవడం లేదు. ఈ సంవత్సర శిశువు ఇంకా నడక కూడా రాని స్థితిలోనే వున్నది. అందుకనే అనేక తప్పడగులు పడవచ్చును. అవి చూసినప్పుడు పాఠకులు పసిపాపను చూసినట్టు చూస్తారని, చూడాలనీ ఆశిస్తున్నాము."

ఇలా మొదటి సంవత్సరం పూర్తి అయిన సందర్భంలో పాఠకులతో తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఆ జన్మదిన సంచికలోనే ఎన్టీఆర్ వర్ణచిత్రం. ఉప పాత్రధారుల పరిచయాలూ ఇలాంటి వన్నీ కూడా వున్నాయి. షావుకారు జానకి గారి ఆత్మకథ కూడా అదే సంచిక మొదలైంది. అయితే ఆ తరవాత సంచికల్లో కొనసాగినప్పటికీ

మధ్యలోనే ఆపేసారు. మూడు సంవత్సరాల క్రిందట షావుకారు జానకి గారు మా ఇంటికి వచ్చినపుడు అడిగాను. “అమ్మా ! మిగతా కథ చెబితే నేను పూర్తి చేస్తాను”అని కానీ, వీలుకాలేదు.

1967 ఆగస్టు అప్పటి కొత్త నటుడు రామ్మోహన్ గారికి ఒక మహిళా అభిమానురాలు రాసిన ఉత్తరాలు ప్రచురించారు. ఇలాంటివి పాఠకుల్లో చాలా ఆసక్తిని రేకెత్తిస్తుండేవి. ఎక్కడా వ్యక్తిగత విషయాల్లో హద్దులు దాటక పోవడం, ఎవరినీ నొప్పించేలా ఉండకపోవడం, విజయచిత్ర లోని వ్యాసాల్లో ప్రత్యేకత చివరివరకూ కొనసాగింది. ఇంక విజయచిత్ర పత్రికలోని కొన్ని మంచి శీర్షికల గురించి మాట్లాడు కోవాలంటే, “వి. చి. సమాధానాలు” అంటే విజయచిత్ర అన్నమాట. అంటే రావి కొండలరావు గారే తన సహజ చమత్కార ధోరణిలో సమాధానాలు ఇస్తుండేవారు.

అలాగే మరొక శీర్షిక.  పాత సినిమాల కథా విస్తరణలు. పాత నటీనటుల జీవిత విశేషాలు. సమకాలీన నటీ నటులతో వివాదాస్పదం కానటువంటి సంభాషణలు. ఇవి కాకుండా ఏ ఇతర సినిమా పత్రికా చెయ్యని ప్రయోగం ఏమిటంటే, సినీ తారల ఆత్మకథలు. షావుకారు జానకి గారూ, చిత్తూరు నాగయ్య గారూ, భానుమతి గారూ, జమున గారూ, శారద గారూ, కె. ఆర్. విజయ గారూ, జయలలిత గారూ వీళ్లందరి జీవిత విశేషాలూ చాలా సమగ్రంగా, నవలా రూపంలో సీరియల్ గా వచ్చాయి.

వీటిల్లో పుస్తకాలుగా వచ్చిన భానుమతిగారి “నాలో నేను” కి అకాడమీ అవార్డు కూడా వచ్చింది. అలాగే నాగయ్య గారి జీవిత చరిత్ర, జమున గారి జీవిత చరిత్ర కూడా పుస్తకాల రూపంలో వచ్చాయి. k.v.r. భక్త గారి వర్ణ చిత్రాలూ, ధీరస్ చౌడా గారి వర్ణ చిత్రాలూ ప్రతి సంచికలోనూ ప్రత్యేకంగా ఉంటూ ఉండేవి. ఒక 17 ఏళ్లపాటు అద్భుతంగా నడిచింది విజయచిత్ర మాస పత్రిక. 1980 వచ్చేసరికి సితార, జ్యోతిచిత్ర, ఆ తరవాత శివరంజని ఇంకా దినపత్రికల్లో కూడా సినిమా వార్తలు రావడం, అన్నిటితో గట్టి పోటీని ఎదుర్కొంటూ, 1994 వరకూ కొనసాగినప్పటికీ 1994 లో మూతబడక తప్పలేదు. మీరు చిట్టచివరి సంచిక ముఖ చిత్రం యూ ట్యూబ్ లో చూడవచ్చు. గౌతమి గారి ముఖ చిత్రం. చివరి సంచికలో ఒక ప్రకటన ఇచ్చారు.

“28 సంవత్సరాలుగా ఎన్ని  ఒడిదుడుకులు ఎదురైనా, ఒక సత్ సాంప్రదాయంతో, నిర్విరామంగా విజయచిత్ర వెలువరిస్తూ వస్తున్నాము. అయితే, రానురాను ముద్రణా రంగంలో పెరిగిన ఖర్చులు, పత్రికా రంగంలో నానాటికీ ఎదురవుతున్న ఆటుపోట్లకు తట్టుకొని పత్రికను వెలువరించాలంటే, కష్ట సాధ్యమవుతుంది. అందుకే కొంత కాలం పాటు ప్రచురణ ఆపి, ఇప్పటి రూపానికి పూర్తి భిన్నంగా, కొత్త శీర్షికలతో, సరికొత్త గెటప్ తో మరింత ఆధునాతనంగా, ఆకర్షణీయంగా “విజయచిత్ర”మీ ముందు ఉంచుతామని మనవి చేస్తున్నాము” – సంపాదకుడు

అన్నారు గానీ, మళ్ళీ అది ప్రారంభం అయ్యే సందర్భం ఏదీ రాలేదు. విజయచిత్ర వైభవానికి ప్రత్యక్ష సాక్షి అయిన రావికొండలరావు గారు ఇటీవలే దివంగతులైన విషయం మనకు తెలిసిందే. విజయచిత్ర లో తన ప్రయాణాన్ని ప్రస్తావిస్తూ తన ఆత్మ కథలో ఇలా రాసుకున్నారు.

“వీలున్నప్పుడల్లా చందమామ ఆఫీసుకు వెళ్లి కూర్చునేవాడిని. దాదాపు రోజూ రావడం చూసి, నాకొక కేబిన్ ఇచ్చారు. పెద్దలు నాకు చాలా సౌకర్యాలు కల్పించారు. గౌరవించారు. తిరగడానికి స్కూటర్ కొన్నారు. అప్పుడు పెట్రోల్ లీటరు రూపాయి నలభై పైసలు. సెకెండ్ హేండ్ స్కూటర్ 3 వేలు. ఏం రోజులు అవి? అలా నేను 26 ఏళ్లపాటు విజయచిత్ర లో పనిచేసాను. మధ్యలో స్త్రీల పత్రిక ”వనిత”మొదలు పెడితే, అది కూడా 5 ఏళ్లపాటు నేనే చూసాను. నాకు సహాయకులుగా బి. కె. ఈశ్వర్, ఎం.ఎల్ . నరసింహం, టి.ఎస్. గోపాల కృష్ణ లాంటి (ఈయన ఆల్ ఇండియా రేడియోలో పని చేసి రిటైర్ అయ్యారు) వీళ్ళందరూ సహాయకులుగా ఉండేవారు. ఏమైనా ఒక దృఢ నిశ్చయంతో , ఉత్తమమైన ధోరణిలో, ఒక మంచి పత్రికను అందించాలనే డాల్టన్ పబ్లికేషన్స్ తలపెట్టి నడపడం, సినిమా పత్రిక చరిత్రలో అపురూపం. విశ్వనాథ రెడ్డి గారి సంపాదకత్వంలో రూపొందిన విజయచిత్ర అద్వితీయం. ఆ పత్రికలో పూర్తి భాద్యత తీసుకొని పని చేయడం నా అదృష్టం. “ అని. ఇప్పుడు ఈ రోజుల్లో , ఆ తరం నటీ నటుల గురించి, సంఘటనల గురించి వివరాలు ఏవైనా కావాలంటే, మొన్నటి వరకూ రావి కొండలరావు గారు ఉండేవారు. ఇప్పుడు విజయచిత్ర పత్రికలే ఆధారం. అన్ని ఏళ్ళ పాటు ఆసిధారావ్రతం లాగా విజయ చిత్రకు సారధ్యం వహించిన విశ్వం గారు ఎంతయినా అభినందనీయులు. ఈ భాగానికి సంబంధించి సమాచారం అందించినవారు వేమూరి సత్యన్నారాయణ గారూ, చొక్కాపు వెంకట రమణ గారూ వీరివురికీ నా హృదయ పూర్వక కృతజ్ఞతలు.

అక్షరీకరణ – వి. వెంకటరావు

2020 అక్టోబర్ 06 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

COMMENTS